క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరాలు

ధర్మారం: నందిమేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుష్మిత ఆధ్వర్యంలో బుధవారం కొత్తూరు, పత్తిపాక గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. పత్తిపాకలో నలుగురు, కొత్తూరులో ఆరుగురి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు మానుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

కమాన్‌పూర్: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు చేస్తున్న తప్పుడు ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు హితవు పలికారు. మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మల్యాల తిరుపతి, రంగు సత్యనారాయణ, గడుప కృష్ణమూర్తి, కిషన్‌రెడ్డి, ముస్తాక్, అనవేన లక్ష్మీరాజం, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

మంథని: నిత్యం ప్రజల శ్రేయస్సు కోసం ఆరాటపడే దుద్దిళ్ల కుటుంబంపై జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ పుట్ట మధు విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని మంథని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ, వైస్ చైర్మన్ సీపతి బానయ్య, మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, నాయకులు వొడ్నాల శ్రీనివాస్, ఎరుకల ప్రవీణ్ తదితరులున్నారు.

ముత్తారం: ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును విమర్శిస్తే సహించేది లేదని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ అన్నారు. బుధవారం ముత్తారం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నాయకులు మద్దెల రాజయ్య, తూటి రఫీ, గాదం శ్రీను, బోల్నేని బుచ్చాంరావు, తాటిపాముల శంకర్, బక్కతట్ల కుమార్, లక్కం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు గండి పూడ్చివేత



జేసీబీతో పూడ్చివేయిస్తున్న మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్: పెగడపల్లి ఊర చెరువుకు పడిన బుంగను మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ పొక్లయిన్‌తో పూడ్చివేయించారు. వర్షాకాలం సీజన్‌లో చెరువు నిండితే బుంగ నుంచి నీరు లీకై చెరువు కట్ట తెగిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. విషయం సారయ్యగౌడ్‌కు మొరపెట్టుకున్నారు. సారయ్యగౌడ్ ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే బుంగను పూడ్చాలని ఆదేశించారు.

రోడ్డుకు మరమ్మతు



సుల్తానాబాద్: పట్టణంలోని పోలీస్ స్టేషన్ రోడ్డు నుంచి శివాలయానికి వెళ్లే రహదారి మధ్యలో రోడ్డు బురదమయమవడంతో మున్సిపల్ కార్మికులు శుభ్రం చేశారు. వాహనదారులు, స్థానికులకు ఇబ్బందులు కలగకుండా మరమ్మతులు చేసినట్లు సిబ్బంది తెలిపారు. దోమలు పెరిగి జ్వరాలు వచ్చే అవకాశమున్నందున జాగ్రత్త వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి సూచించారు.

పేకాట స్థావరంపై దాడి

రామగుండం: రామగుండం పరిధిలోని ఇందిరానగర్ కాలనీలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రవిప్రసాద్, ఎస్సై రాజేష్‌లు తెలిపిన వివరాల మేరకు... ఇందిరానగర్ కాలనీలోని ఓ ఇంట్లో నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని రూ.24,670 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని వారిని రామగుండం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ హెడ్‌కానిస్టేబుల్ ఏలియా, మహేందర్, కానిస్టేబుళ్లు ప్రకాశ్, అఖిల్, మల్లేశ్, రాజేందర్, సునీల్ పాల్గొన్నారు.

తుమ్మ చెట్లను తొలగించండి

కాల్వశ్రీరాంపూర్: పెగడపల్లి పెద్ద చెరువు మత్తడి చుట్టూ తుమ్మ చెట్లు ఏపుగా పెరిగి చెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువుకు పడిన బుంగను పూడ్చిన అధికారులు చెరువు మత్తడి చుట్టూ ఏపుగా పెరిగిన తుమ్మ చెట్లను తొలగించడం విస్మరించారని వాపోయారు. కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు వినతి ప్రత్రం ఇచ్చామని పేర్కొన్నారు. టి.పోశాలు, మొండయ్య, శంకర్, కె.సదయ్య, రమేశ్, రవి, రాజు, కుమార్, సదయ్య ఉన్నారు.

ప్రమాదకరంగా మంచినీటి బావులు

- రక్షణ చర్యలు చేపట్టాలని ధూళికట్ట గ్రామస్తుల వేడుకోలు



ధూళికట్టలో పక్కపక్కనే ఉన్న బావులు

ఎలిగేడు: ధూళికట్ట ఊర చెరువు కట్ట కిందనున్న ప్రధాన రోడ్డు(డబుల్)ను ఆనుకొని రెండు రక్షిత మంచినీటి బావులు ప్రమాదకరంగా మారాయి. ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు.. పోయిన ప్రాణాలను తెచ్చి ఇస్తారా.. లేక ప్రాణానికి వెల కడతారా అని ధూళికట్ట గ్రామస్తులు అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో ఊరు పుట్టినప్పటి నుంచి పాత మంచినీటి బావి ఉంది. గ్రామస్తులు ఇప్పటికి బావి నీటినే వినియోగిస్తున్నారు. తాగునీటికి కరువు ఏర్పడటంతో పాత బావి పక్కనే మరో రక్షిత మంచినీటి బావిని 20 ఏళ్ల క్రితం తవ్వించి గాజులు పోశారు. ఈ బావి ఉపయోగంలోకి రాకపోగా.. పాత బావినే నేటికి గ్రామస్తులు ఉపయోగిస్తున్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా డబుల్ రోడ్డు నిర్మాణం కాగా.. డబుల్ రోడ్డుకు సమానంగా రెండు బావులుండటంతో ప్రమాదకరంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే ఆ రోడ్డు వెంట వాహనదారులు, బాటసారులు, సైకిల్‌పై వెళ్లేవారు, చుట్టుపక్క ఇళ్లలో ఆడుకునే చిన్నారులకు ప్రమాదకరంగా మారడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు?

ఈ బావులను ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోతే ఎవరు బాధ్యులని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదవశాత్తు బావిలో పడి ప్రాణాలు కోల్పోతే తప్పా ఎవరు స్పందించరా అని వాపోతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి బావులకు గోడలు రక్షణగా నిర్మించాలని వేడుకుంటున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల వెంట ప్రమాదకరంగా వ్యవసాయ బావులు సైతం ఉన్నాయి వాటిని అధికారులు గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గోడలు కట్టాలె..



బావుల ముందే మా కిరాణా దుకాణం ఉంది. బావులు రోడ్డుకు సమానంగా చాలా ప్రమాదకరంగా ఉన్నయ్. వాటికి రక్షణగా గోడలు కట్టాలె.

– పెద్దపల్లి లత, కిరాణా దుకాణ నిర్వాహకురాలు, ధూళికట్ట

పట్టించుకుంటలేరు



ప్రమాదకరంగా ఉన్న బావులను అధికారులు పట్టించుకుంటలేరు. రోడ్డు వెంట వెళ్లే వారికి ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోతే ఎవరిది బాధ్యత. వెంటనే అధికారులు స్పందించాలె.

– భూసారపు శంకరయ్య, ధూళికట్ట గ్రామస్తుడు

ఇదేం నిర్లక్ష్యం



గ్రామంలో డబుల్ రోడ్డు నిర్మాణం కావడంతో మంచి నీటి బావుల్లో రోడ్డుకు సమానంగా ఒకటి, రోడ్డుకు కిందకు మరొకటి ప్రమాదకరంగా ఉన్నయ్. అధికారులు చూసీచూడనట్లు నిర్లక్ష్యంగా ఉంటున్నరు. ఏ ప్రమాదం జరగకముందే స్పందించి రక్షణగా గోడలను నిర్మించాలె. – లస్మయ్యగౌడ్, గ్రామస్తుడు

నేడు రైతు వేదికలో రుణమాఫీ సంబరాలు



ప్రత్యక్ష ప్రసారం ట్రయల్ రన్ ఏర్పాట్లు చేస్తున్న ఏవో ప్రకాశ్, ఏఈవో హరీశ్

జ్యోతినగర్: రైతు వేదికల్లో రుణమాఫీ సంబరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రామగుండం మండల వ్యవసాయాధికారి కె.ప్రకాశ్, ఏఈవో హరీశ్ అన్నారు. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ మేడిపల్లి గ్రామంలోని రైతు వేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం రుణమాఫీ లాంఛనంగా ప్రారంభించడంతోపాటు లబ్ధిదారులతో నేరుగా మాట్లాడేందుకు వీలుగా ప్రత్యక్ష ప్రసార ఏర్పాట్లను పరిశీలిస్తున్నామని అన్నారు. మొదటి రోజు రూ.లక్ష లోపు రుణాలు మాఫీ కార్యక్రమాన్ని రైతు వేదిక ద్వారా రైతులు వీక్షించొచ్చన్నారు. ప్రజాప్రతినిధులు, అభ్యుదయ రైతులు, బ్యాంకు ప్రతినిధులు పాల్గొనే అవకాశమున్నందున రైతులు తప్పనిసరిగా అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఎలిగేడు: రూ.లక్ష లోపు ఉన్న రైతులకు మొదటగా రుణమాఫీని గురువారం సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తుండటంతో మండల కేంద్రంలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించి సంబరాలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.ఉమాపతి తెలిపారు.

మంథని: పంట రుణాల మాఫీ ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభిస్తున్న సందర్భంగా గురువారం గుంజపడుగు రైతు వేదికలో లబ్ధిదారులతో సంబరాలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి భూక్య మోహన్ తెలిపారు.

ముత్తారం: మండలంలోని 14 పంచాయతీల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీలో మొదటి దఫాలో రూ.లక్ష వరకు 1,616 మందికి అయిందని మండల వ్యవసాయాధికారి చిందం శ్రీకాంత్ తెలిపారు.

ముస్తాబైన సాయి ఆలయం



గౌతమినగర్‌లోని సాయిబాబా ఆలయం

ఫెర్టిలైజర్‌సిటీ: జిల్లాలో అతి పెద్ద షిరిడి సాయిబాబా మందిరం రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లో నిర్మించారు. 1993వ సంవత్సరంలో కొలువైన సాయిబాబా మూడు దశాబ్దాల నుంచి నిత్య పూజలు అందుకుంటున్నాడు. గురువారం గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించేందుకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. దత్తాత్రేయస్వామికి ఉదయం పంచామృతాలతో అభిషేకం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకి సేవ ఉంటుందని ఆలయ అర్చకులు తెలిపారు.

నేడు ఉర్సు ఉత్సవాలు

సుల్తానాబాద్: పట్టణంలోని పోలీస్ స్టేషన్ వెనక వైపున్న సయ్యద్ హజ్రత్ అబ్దుల్ ఖాదర్ షహిది రహ్మతుల్లా అలై దర్గాలో ఉర్సు, సందల్ ఉత్సవాలను గురువారం రాత్రి నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. పెదపల్లి శాసన సభ్యుడు చింతకుంట విజయరమణారావుతోపాటు స్థానిక నాయకులు హాజరౌతారన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి కుర్చీలు వితరణ



కుర్చీలు అందించిన లయన్స్ క్లబ్ సభ్యులు

గోదావరిఖనిటౌన్: ప్రభుత్వ ఆసుపత్రి అనస్థీసియా వైద్యుడు డాక్టర్ రామమ్, రాజేశ్వరి దంపతుల కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం స్థానిక అడ్డగుంటపల్లిలోని అంగన్వాడీ కేంద్రంలో పిల్లల మధ్య కేక్ కట్ చేశారు. గోదావరిఖని లయన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి ఆధ్వర్యంలో పిల్లలకు కుర్చీలు, పలకలు, పెన్నులు పంపిణీ చేశారు. నార్ల ప్రసాద్, మామిడిపల్లి శ్రీధర్, కోదాటి ప్రవీణ్, గుంత వినోద్, జయప్రకాశ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ-2లో ప్లానింగ్ డైరెక్టర్ పర్యటన



రామగిరి: ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2 గనిలో బుధవారం ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి పర్యటించారు. వ్యూ పాయింట్ నుంచి క్వారీలో నడుస్తున్న పనులను పరిశీలించారు. నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు తీసుకుంటున్న భద్రత చర్యలు, ప్రణాళికలను జీఎం ఎస్.సుధాకర్‌రావును అడిగి తెలుసుకున్నారు. ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్‌బాబు, ప్రాజెక్టు అధికారి కె.రాజేందర్, ప్రాజెక్టు ఇంజనీర్ ఎం.నాగరాజు, మేనేజర్ కె.వి.రామరావు, ఎస్టేట్ అధికారి ఐలయ్య, సర్వే అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగం..

- అధికారుల అనాలోచిత నిర్ణయాలతో నిధుల దుర్వినియోగం
- దశాబ్దకాలంగా తెరచుకోని షట్టర్లు



రామగుండం తహసీల్ కార్యాలయం ఎదుట కాంప్లెక్స్

రామగుండం: అర్బన్ పరిధిలోని నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి కల్పనతోపాటు కార్పొరేషన్‌కు ఆదాయ వనరుగా ఉండేందుకు రామగుండం తహసీల్ కార్యాలయం ఎదుట దశాబ్దకాలం క్రితం ఐదు షట్టర్లతో కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. ఒక షెట్టర్‌లో ఫుట్బార్ మార్కెట్ కమిటీ కార్యాలయం అద్దెకు తీసుకున్నా.. దూరాభారంతో నిర్వహణ కష్టసాధ్యంగా మారడంతో మూసివేశారు. రామగుండం బైపాస్ రాజీవ్ రహదారి పక్కనే ఉండడంతో సదరు షట్టర్ల వద్ద ఎలాంటి పార్కింగ్ వసతి లేకపోవడం, ప్రజలకు ఆ ప్రదేశంలో ఎలాంటి అవసరాలు లేకపోవడంతో నిలిచే అవకాశం లేకపోవడం, రోడ్డు పక్కన తహసీల్ కార్యాలయమున్నా అత్యధిక వాహనాల రాకపోకలతోపాటు రోడ్డుకు మధ్యలో డివైడర్ ఉండడం అవరోధంగా మారడంతో సదరు షట్టర్లలో చిరు వ్యాపారం చేసుకునేందుకు అనుకూలంగా లేకపోవడం కారణంగా పేర్కొనొచ్చు. వీటిని ఏమైనా ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగించుకుంటేనే నిర్మాణాలు భద్రంగా ఉంటాయని పలువురు పేర్కొంటున్నారు.

30 ఏళ్ల క్రితం ఎస్సీ కాంప్లెక్స్..

రామగుండం రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రధాన రహదారిలో రైల్వే భూగర్భ వంతెన సమీపంలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఎస్సీ కాంప్లెక్స్ నిరుపయోగంగా మారింది. ఏదో మొక్కుబడిగా నిర్మించిన కాంప్లెక్స్‌కు కనీస మౌలిక సదుపాయాల కల్పనలో ఎస్సీ కార్పొరేషన్ విఫలమైంది. సదరు గదులను అర్హులైన దళిత నిరుద్యోగ యువకులకు కేటాయించినా.. నాణ్యతతో నిర్మించకపోవడంతో గదుల నుంచి వర్షపు నీరు లోపలికి వస్తోంది. నాలుగేళ్లుగా విద్యుత్ కనెక్షన్ సైతం తొలగించడంతో కాంప్లెక్స్ నిరుపయోగంగా మారింది. సంబంధిత ఎస్సీ కార్పొరేషన్ అధికారులు స్పందించి ప్రస్తుతం దాని సమీపంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు కానుండడంతో భవనాన్ని ఆధునీకీకరించి లబ్ధిదారులకు కేటాయించాలని కోరుతున్నారు.

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

మంథని: తమను గుర్తించి శిక్షణతోపాటు సర్టిఫికెట్లు జారీ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేయడంతో.. బుధవారం ఆర్‌ఎంపీ, పీఎంపీలు ముఖ్యమంత్రితోపాటు మంత్రులు దామోదర రాజనరసింహా, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట డివిజన్‌లోని ఆర్‌ఎంపీ, పీఎంపీలు సంబరాలు జరుపుకున్నారు. డివిజన్ అధ్యక్షుడు కసివొజ్జల వీరాచారి, జిల్లా కోశాధికారి శంకర్, డివిజన్ సెక్రటరీ పైడయ్య, ఉపాధ్యక్షుడు కోటేశ్ తదితరులున్నారు.



ఎలిగేడు: ధూళికట్టలో దారి మైసమ్మకు పూజలు చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు



కాల్వశ్రీరాంపూర్ శివాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

ఎలిగేడు/జూలపల్లి/యైటింక్లయిన్‌కాలనీ/సుల్తానాబాద్‌రూరల్/కాల్వశ్రీరాంపూర్/సుల్తానాబాద్/ఓదెల: జిల్లాలో తొలి ఏకాదశి వేడుకలను ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి దేవతామూర్తులకు మొక్కులు చెల్లించారు. మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



సుల్తానాబాద్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో భజన చేస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు



పొత్కపల్లిలో చక్కెరతో అభిషేకం





ఫెర్టిలైజర్‌సిటీ: వీర్లపల్లిలో పీరీలకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు, ఎలిగేడు: ముప్పిరితోటలో..

ఘనంగా మొహర్రం వేడుకలు

ఫెర్టిలైజర్‌సిటీ/ఎలిగేడు/జూలపల్లి/కమాన్‌పూర్/సుల్తానాబాద్‌రూరల్/యైటింక్లయిన్‌కాలనీ/రామగుండం/గోదావరిఖనిటౌన్/కాల్వశ్రీరాంపూర్/ఓదెల: జిల్లాలో మొహర్రం వేడుకలను బుధవారం హిందూముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామా ల్లోని మసీదుల వద్ద పీరీలకు దస్తీ, కుడుక కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అగ్నిగుండం చుట్టు ఆటలతో హోరెత్తించారు. పలువురి వేషధారణలు ఆకట్టుకున్నాయి.



రామగుండం: అంతర్గాంలో షర్బత్ పంపిణీ చేస్తున్న ముస్లింలు





యైటింక్లయిన్‌కాలనీ: పీరీలకు కుడుకలు కడుతున్న భక్తులు, సుల్తానాబాద్‌రూరల్: కనుకులలో..

మత ప్రచారం చేస్తున్నవారిని అడ్డుకున్న నాయకులు



ప్రచారం చేసేందుకు వచ్చినవారిని అడ్డుకుంటున్న నాయకులు

ఓదెల: పొత్కపల్లి గ్రామంలో మత ప్రచారానికి వచ్చినవారిని స్థానిక బీజేపీ, బజరంగదళ్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు బుధవారం అడ్డుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. జమ్మికుంట, వీణవంక మండలాలకు చెందిన పలువురు వాహనాల్లో మత ప్రచారం కోసం పొత్కపల్లికి వచ్చారు. వారి రాకను పసిగట్టిన స్థానిక బీజేపీ నాయకులు శానగొండ శివారులో వాహనాలతోపాటు వారిని అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మత ప్రచారకుల వద్ద ఉన్న కరపత్రాలను చింపివేయటంతోపాటు బీజేపీ నాయకులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. స్థానిక పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి, ఓంకార్‌యాదవ్, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. పెద్దపల్లి నుంచి హుటాహుటిన ఏసీపీ గజ్జి కృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని పోలీస్ స్టేషన్‌లో ఉన్నవారిని విచారించారు. విషయం తెలుసుకొని ఇరువర్గాలవారిని ఏసీపీ శాంతింపజేశారు. గంటపాటు వివరాలను సేకరించి రాతపూర్వకంగా తీసుకొని పంపించారు.

కార్యాలయం అందుబాటులో ఉండాలి

మంథని: మంథని మున్సిపల్ కార్యాలయాన్ని పట్టణ శివారులో నిర్మించే ఆలోచన సరికాదని, ప్రజలకు అందుబాటులో ఉండేలా చేపట్టాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పోతరవేని క్రాంతికుమార్ కోరారు.

డ్రైయినేజీ నిర్మించారు.. మట్టి పోయడం మరిచారు



కమాన్‌పూర్: గుండారం బస్టాప్ వద్ద మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి వెంట ఆర్ అండ్‌బీ నిధులతో ఇటీవల డ్రెయినేజీ నిర్మించారు. నిర్మించి నెల రోజులు గడుస్తున్నా.. మట్టిని చదును చేయక పోవడంతో స్థానిక ప్రజలు, పశువులు దాటేందుకు ఇబ్బంది తప్పడం లేదు. సదరు కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని గ్రామ మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు తెలిపారు.

వానొస్తే రోడ్లన్నీ బురదే..



జ్యోతినగర్: చిన్న వాన వచ్చినా రోడ్డంతా బురదమయంగా మారుతోంది. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీలో చిన్న వర్షం వచ్చినా మెయిన్ రోడ్డు బురదమయంగా మారడంతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. లింగాపూర్ మోడల్ పాఠశాలకు వెళ్లే దారి గుంతలతోపాటు బురదమయంగా మారడంతో బస్సుతోపాటు ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించాలని కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు మడిపల్లి మల్లేశ్, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ తీగలు సరి చేయండి సారూ..

అటెన్షన్ ప్లీజ్



జ్యోతినగర్: సార్లూ విద్యుత్ తీగలు చేతికి అందేలా ఉన్నాయి.. వాటిని సరి చేయండి అంటూ కాలనీవాసులు విద్యుత్ అధికారులను వేడుకుంటున్నారు. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెలో విద్యుత్ తీగలు చేతికి అందేలా కిందికి ఉన్నాయి. వానలు పడుతున్న క్రమంలో చీకట్లో ఎవరైనా పెద్ద వాహనంపై వస్తే తీగలు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. సంబంధిత విద్యుత్ విభాగం అధికారులు స్పందించి తీగలను సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మలుపు

చిత్ర కథ



జూలపల్లి: మండల కేంద్రం నుంచి కొత్తూరు వెళ్లే దారిలో సెంట్రల్ నర్సరీ వద్ద డి-83 మెయిన్ కాలువ దగ్గరలో మలుపు ప్రమాదకరంగా మారింది. మలుపు వచ్చేదాకా వాహనదారులకు కాలువ కనబడకపోవడంతో నేరుగా కాలువలోకి వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇంతకుముందు అబ్బాపూర్‌కు చెందిన వాహనదారుడు పడిపోయాడు. మహబూబ్‌నగర్‌కు చెందిన వ్యక్తి ట్రాక్టర్‌తో సహా కాలువలో పడగా మృతిచెందాడు. ఇక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఎస్‌ఆర్‌ఎస్‌పీ అధికారులు వెంటనే సూచిక బోర్డుతోపాటు కాలువకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సాక్షి
దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా:
9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
పెద్దపల్లి : కె.తిరుపతి, ACO - 7997958206
పెద్దపల్లి : ఎం.మహేందర్, SR - 9573331940
మంథని : రాజేశ్ - 9676603963
రామగుండం : సర్వర్ - 6281694028
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899